సాక్షి విజయనగరం

శనివారం | 4 | జనవరి | 2025

I



పింఛన్.. వంచన..! - IIలో

అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తామన్నారు.. తీరా అధికారంలోకి వచ్చాక కూటమి నేతలు వంచనకు గురిచేస్తున్నారు.



ముద్దాయికి 25 ఏళ్ల జైలు

పోక్సో కేసులో నిందితుడు ఎరుకన్న దొరకు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. - IIలో

సమస్యల పరిష్కారమే లక్ష్యం

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్‌డేను నిర్వహిస్తున్నట్టు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వెల్ఫేర్ డేలో పోలీస్ సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. వలు సమస్యలు పరిష్కరించారు.

న్యూస్‌రీల్

మహిళా పోలీస్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



పరుగు పందెంను పర్యవేక్షిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: స్టైపెండరీ మహిళా పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు పీఎంటీ, పీఈటీ పరీక్షల ప్రక్రియను ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం ప్రారంభించారు. 550 మందికి 314 మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. దేహదారుఢ్య పరీక్షలను ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు, పలువురు సీఐలు, ఆర్ఐలు, పోలీస్ అధికారులు పర్యవేక్షించారు.

ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్స్


- రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దార్ల సంఘం

విజయనగరం అర్బన్: పింఛన్‌దార్లకు లైఫ్ సర్టిఫికెట్స్‌ను స్థానిక పింఛన్‌దారుల సంఘం భవనంలో ఉచితంగా అందజేస్తామని రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదార్ల సంఘం అధ్యక్షుడు పెద్దింటి అప్పారావు తెలిపారు. పింఛన్‌దారులు తమ ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, పింఛన్ పుస్తకం తీసుకొని నేరుగా సంఘ కార్యాలయాలని రావాలని కోరారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

విజయనగరం అర్బన్: వివిధ ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందేందుకు నిరుద్యోగ మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎస్‌టీఆర్‌సీఎస్‌డీ అండ్ ఈడబ్ల్యూ జిల్లా మేనేజర్ పి.విమల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూయింగ్ మెషిన్ ఆపరేటర్ (45 రోజులు), మగ్గం వర్క్, బేకరీ ప్రొడక్ట్స్ (30 రోజులు) కోర్సులకు 8వ తరగతి విద్యార్హత ఉన్న వారు అర్హులన్నారు. అసిస్టెంట్ బ్యూటీ థెరిపిస్ట్ (60 రోజులు) ఉపాధి కోర్సుకు 10 తరగతి కనీస విద్యార్హతగా పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 10వ తేదీలోపు స్థానిక మహిళా ప్రాంగణానికి అందజేయాలని సూచించారు. వివరాలకు సెల్: 83339 21338, 93463 28789 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వేట నిషేధ భృతికి మంగళం!



- ఆరునెలల తరువాత మత్స్యకార భరోసాపై తూచ్ అన్న కూటమి ప్రభుత్వం
- వరుస తుఫాన్లు, ఆటుపోట్లతో జీవనానికి మత్స్యకారులు కటకట
- సాయం అందకపోవడంపై మత్స్యకార కుటుంబాల ఆందోళన

పూసపాటిరేగ: మత్స్యకారులకు గత ఏడాది జూన్‌లో అందజేయాల్సిన వేటనిషేధ భృతికి టీడీపీ కూటమి ప్రభుత్వం మంగళం పాడేసిందా అంటే.. మత్స్యకార వర్గాల నుంచి అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈ ఏడాది జూన్‌లో వేటనిషేధ భృతి అందజేస్తామని కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయంపై స్పష్టతలేకపోవడంపై మత్స్యకార వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇది గత ఏడాది చెల్లించాల్సిన భృతా.. లేదంటే ప్రస్తుత ఏడాదికి సంబంధించినదా? అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మత్స్యకారులను కూటమి నాయకులు మోసం చేస్తున్నారంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. వాస్తవంగా చేపల సంతతి వృద్ధిలో భాగంగా ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సంద్రంలో ప్రభుత్వం వేటనిషేధం ప్రకటిస్తుంది. ఈ కాలంలో మత్స్యకారులకు ఎలాంటి ఉపాధి ఉండదు. జీవనానికి ఇబ్బందులు పడకుండా గత ప్రభుత్వం రూ.10వేలు చొప్పున ఏటా మత్స్యకారుల ఖాతాల్లో జమచేసేది. 2024లో జరిగిన ఎన్నికల సమయంలో కూటమి నేతలు వేటనిషేధ భృతి రూ.20వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. మత్స్యకారుల ఓట్లకు వలవిసిరారు. అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడిచినా భృతి చెల్లించలేదు. తాజాగా జరిగిన కేబినెట్ సమావేశంలో 2025 జూన్‌లో వేట నిషేధ భృతి చెల్లిస్తామని చెప్పారు. దీనిపై మత్స్యకారులు భగ్గుమంటున్నారు. గత ఏడాది చెల్లించాల్సిన భృతి ఎగ్గొట్టిస్తారా? అని ప్రశ్నిస్తున్నారు.

చేపల వేటే జీవనాధారం..

జిల్లాలో తీరప్రాంత మండలాలైన పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని 19 మత్స్యకార గ్రామాల్లో 21 వేలు మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. వారిలో సుమారు 5 వేలు మంది సంద్రంలోకి వేటకు వెళ్తుండగా, పరోక్షంగా మరో 16 వేలు మంది వారిపై ఆధారపడి జీవిస్తున్నారు. 885 బోట్లలో 3,798 మంది మత్స్యకారులు నిత్యం వేటను సాగిస్తున్నారు. పూసపాటిరేగ మండలంలో చింతపల్లి, నీలగెద్దపేట, చింతపల్లిబర్రిపేట, చింతపల్లి పెద్దూరు, కొత్తూరు, పతివాడబర్రిపేట, తిప్పలవలస, తమ్మయ్యపాలెం, పులిగెడ్డ, కోనాడ, బొడ్డు గురయ్యపేట, బొడ్డు వెంకటేషుపేట, భోగాపురం మండలంలోని చేపలుకంచేరు, ముక్కాం, కొండ్రాజుపాలెం, చినకొండ్రాజుపాలెం, చోడిపల్లిపేట, ఎర్రముసలయ్యపాలెం తదితర తీర గ్రామాల ప్రజలకు సంద్రమే జీవనాధారం. వేట సాగితేనే నాలుగు మెతుకులు నోట్లోకి వెళ్లేది. ఓ వైపు తుఫాన్లు.. మరోవైపు ఆరునెలల కిందట అందాల్సిన వేట నిషేధ భృతి అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మత్స్యకారులపై చిన్నచూపు చూస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వ తీరును దుయ్యబడుతున్నారు.

మండలం	తీర గ్రామాలు	మత్స్యకారులు
పూసపాటిరేగ	12	13,237
భోగాపురం	7	7,781



చింతపల్లిలో ఒడ్డున నిలిపిన పడవలు

మత్స్యకారులను విస్మరిస్తోన్న కూటమి ప్రభుత్వం



అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించింది. అధికారంలోకి వచ్చి ఆరునెలలు దాటుతున్నా వేట నిషేధ సమయంలో అందజేయాల్సిన పరిహారం మంజూరు చేయలేదు. చింతపల్లిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన శంకుస్థాపన జెట్టీ నిర్మాణంపై కూడా నిర్లక్ష్యంచేస్తోంది. వేట నిషేధ భృతి చెల్లింపులో దొంగాటపై మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

– బర్రి చినఅప్పన్న, జిల్లా మత్స్యకార సహకార సొసైటీ అధ్యక్షుడు, విజయనగరం

విజ్ఞానం పంచిన వైజ్ఞానిక ప్రదర్శన

- ముగిసిన జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక పోటీలు
- రాష్ట్రస్థాయికి వలు ప్రాజెక్టుల ఎంపిక



ప్రదర్శనలోని ప్రాజెక్టుల గురించి తెలుసుకుంటున్న న్యాయనిర్ణేతలు

విజయనగరం అర్బన్: జిల్లా విద్యాశాఖ అధికారులు స్థానిక సెయింట్ మేరీ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన విద్యావైజ్ఞానిక ప్రదర్శన పోటీలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. విజ్ఞానాన్ని పంచాయి. కొత్తకొత్త ఆలోచనలు, ఆవిష్కరణలకు నాందిపలికాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజెక్టుల పనితీరు, వాటి వల్ల కలిగే ఉపయోగాలను సవివరంగా తెలియజేశారు. విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. పోటీలు విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజికల్ మ్యూజియం (వీఐటీఎం), నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం (ఎన్‌సీఎస్‌ఎం) సహకారంతో సాగాయి. ప్రదర్శనలను డీఈఓ యు.మాణిక్యంనాయుడు ప్రారంభించారు. మండల స్థాయిలో మూడు కేటగిరీల్లో ఎంపికైన 81 ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారు. భౌతిక శాస్త్రం, కెమిస్ట్రీ, గణితం, ఎర్త్/స్పేస్ సైన్స్, పర్యావరణ శాస్త్రం, ఇంజినీరింగ్, బయోసైన్స్, బయోకెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అనే 8 అంశాలపై పోటీ ప్రదర్శన జరిగింది. టీచర్ ఎగ్జిబిట్, విద్యార్థుల వ్యక్తిగత ఎగ్జిబిట్, గ్రూప్ విభాగాల్లో ప్రదర్శన పోటీలు సాగాయి. పోటీల ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే చదువుతోపాటు శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఉత్తమ ప్రాజెక్టులు రూపకర్తలకు జ్ఞాపికలు, బహుమతులు, ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ బి.విజయభాస్కర్, డిప్యూటీ ఈఓలు కె.వి.రమణ, కె.మోహనరావు, డీసీబోర్డు కార్యదర్శి టి.సన్యాసిరాజు, తదితరులు పాల్గొన్నారు.



టీచర్ కేటగిరీలో ఎంపికైన 'రైల్వే స్టేషన్‌లో రూట్ ఓవర్ స్మార్ట్ బ్రిడ్జ్' ప్రాజెక్టు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ప్రాజెక్టులు ఇవే..

వ్యక్తిగత విభాగం: ఎస్.ధనోజ్ (జెడ్పీహెచ్ స్కూల్, పెదవేమలి), ఆర్.శివ (ఏపీఎంఎస్, పెదమేడపల్లి)
గ్రూప్ విభాగం: బి.దుర్గాప్రసాద్, వి.మణికంఠ (జెడ్పీ హైస్కూల్ తోండ్రంగి), టి.సంజన, పి.సుష్మ (బీఆర్ అంబేడ్కర్ గురుకులం, వియ్యంపేట)
ఉపాధ్యాయ విభాగం: బి.శ్రీనివాసరావు (జెడ్పీ హెచ్ స్కూల్, రామతీర్థం), సీహెచ్ ఉమామహేశ్వరరావు (జెడ్పీహెచ్ స్కూల్, గుర్ల)

ఉన్నత లక్ష్యంతో భవిత బంగారం

- జేసీ సేతుమాధవన్

శృంగవరపుకోట: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకుని వాటిని సాధించే దిశగా చదువు సాగిస్తే భవిష్యత్తు బంగారం అవుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ అన్నారు. కిల్తంపాలెంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ వి.దుర్గాప్రసాద్ స్కూల్ సాధించిన లక్ష్యాలను జేసీకి వివరించారు. ఈ సందర్భంగా జేసీ సేతుమాధవన్ పాఠశాల పరిసరాలను, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.



నవోదయ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జేసీ సేతుమాధవన్



నిరసన ర్యాలీ

సహారా బ్యాంకు తీరుతో దగాపడిన ఖాతాదారులు, ఏజెంట్లు, డిపాజిట్‌దారులు ఎస్.కోట పట్టణంలోని బ్యాంకు కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. దేవీ కూడలి వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించారు. బాధితులను ఆదుకునేందుకు చంద్రబాబు సర్కారు చర్యలు తీసుకోవాలంటూ నినదించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధితులను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి డీటీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలిండియా సహారా బాధితుల సంఘ నాయకురాలు పూజిత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ, సహారా జోనల్‌మేనేజర్లు రామకోటేశ్వరరావు, నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు. – శృంగవరపుకోట

ప్రజావ్యతిరేక పాలన

- ప్రజలు మోయలేనంతగా విద్యుత్ చార్జీలు
- అమలుకాని సంక్షేమ పథకాలు
- భరోసా లేని సాగు
- పరిశ్రమల మూతతో ఉపాధికోల్పోతున్న కార్మిక కుటుంబాలు
- కూటమి ప్రభుత్వ తీరును దుయ్యబట్టిన మాజీ ఎంపీ బెల్లాన, మాజీ ఎమ్మెల్యే బొత్స

గజపతినగరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందని, కష్టాలే మిగుల్చుతోందని విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ శాసనసభ్యుడు బొత్స అప్పలనరసయ్య విమర్శించారు. గజపతినగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఖరీఫ్ ముగిసినా రైతులకు రూ.20వేల పెట్టుబడి సాయం అందలేదని, ధాన్యం దళారులకే విక్రయించుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు.

భీమసింగ్ సుగర్ ఫ్యాక్టరీని తెరిపించి నిరుద్యోగులకు పని కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు, లోకేశ్‌లు అధికారంలోకి వచ్చిన తరువాత నోరు మెదపడంలేదని మండిపడ్డారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించే దిశగా కనీసం ఆలోచన చేయడం లేదన్నారు. గజపతినగరం నియోజకవర్గంలో 1200 మందికి ఉపాధి కల్పించే జీడిపిక్కల ఫ్యాక్టరీ మూతపడినా కనీసం మంత్రి స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మరుపల్లిలో 80 ఎకరాలు, రోళ్లవాకలోను 50 ఎకరాల ప్రభుత్వ భూములను పరిశ్రమల పేరిట సొంత మనుషులకు కట్టబెట్టేందుకు నేతలు ఆలోచన చేయడం దారుణమన్నారు. తల్లికి వందనం, ఫీజురీయింబర్స్‌మెంట్, ఉచిత బస్సు తదితర పథకాలకు మంగళం పాడుతున్న కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయన్నారు. జిల్లాకు మెడికల్ కళాశాల, జేఎన్‌టీయూ వర్సిటీ, భోగాపురం ఎయిర్‌పోర్ట్, ఫిషింగ్ హార్బర్ వంటి ప్రగతి కేంద్రాల స్థాపన ఘనత వైఎస్సార్‌సీపీదేనని అన్నారు. కార్యక్రమంలో గజపతినగరం జెడ్పీటీసీ సభ్యుడు గారతవుడు, పార్టీ మండలాధ్యక్షుడు బూడి వెంకటరావు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి అప్పలనాయుడు, సీనియర్ నేతలు మండల సురేష్, కరణం ఆదినారాయణ, బెల్లాన త్రినాథరావు, కందితి రుపతి నాయుడు, కర్రి రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, బొత్స అప్పలనరసయ్య

'పల్లె పండగ'.. పనులు దండగ!



ఇది బొబ్బిలి మండలంలోని డొంగురువలస, రామందొరవలస కూడలి నుంచి విజయపురి గ్రామానికి వెళ్లే రోడ్డు. నాలుగైదు గిరిజన గూడలు, మరో రెండు మైదాన గ్రామాల ప్రజల రాకపోకలకు ఈ రెండు కిలోమీటర్ల రోడ్డే ఆధారం. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా బీటీ రోడ్డు వేయడానికి రూ.47 లక్షలు మంజూరు చేశారు. నెలలు గడుస్తున్నా పనులకు అతీగతి లేదు. పల్లె పండగ రోడ్లు, ఇతర పనులపై పంచాయతీ రాజ్ అధికారులు నిత్యం సమీక్షలు నిర్వహిస్తున్నా అదిగో ఇదిగో అంటున్నారే తప్ప అధికార బలంతో వెండర్లు పనులు ప్రారంభించడం లేదు.

- జిల్లా వ్యాప్తంగా రూ.165 కోట్లతో 2,200 పనులు మంజూరు
- సంక్రాంతి నాటికే పనులు పూర్తి చేస్తామని అట్టహాసంగా ప్రకటనలు
- నేటికి 40 శాతం పనులు పూర్తి కాని వైనం
- చేయని పనులు మంజూరు చేయడం దండగ అంటున్న జనం

బొబ్బిలి: పల్లె పండగ.. ప్రతీ గ్రామంలో సీసీ రహదారులు, కల్వర్టులు, డ్రెయిన్లతో గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దుతాం! సంక్రాంతి నాటికి అన్ని పల్లెల్లో పండగే ! ఇదీ ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వరకూ చెప్పిన మాట! దీని ప్రకారమే గతేడాది డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పాటు జిల్లా నాయకుల వరకూ అట్టహాసంగా పనులు ప్రారంభించారు. ప్రారంభాలకు చూపించిన శ్రద్ధ వాటి నిర్మాణాల్లో చూపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా పల్లెపండగ పేరిట గ్రామాల్లో పనులు చేపట్టేందుకు అన్ని గ్రామాల్లో 2,200 పనులు గుర్తించారు. వీటి కోసం రూ.165 కోట్లను మంజూరు చేశారు. బిల్లులు వెంట వెంటనే చేస్తున్నామని చెబుతున్నా పనులు మాత్రం జోరందుకోవడం లేదు. పనులు అట్టహాసంగా ప్రారంభించి సంక్రాంతి నాటికి నిర్మాణాలు పూర్తి చేస్తామని ప్రకటనలు గుప్పించి నేటికి నెలలు గడుస్తున్నా 40 శాతం కూడా పూర్తి కాలేదు. మరి సంక్రాంతి నాటికి పల్లెల్లో పండగ ఎలా సాధ్యమో నేతలకే ఎరుక?.

కారణమేంటంటే?

జిల్లాలో 2,200 పనులను కూటమి నాయకులకే కాంట్రాక్టులు ఇచ్చారు. వీరు గ్రామాల్లోని లెక్కకు మించిన పనులను కూడా తామే చేస్తామని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో కూటమి నాయకులు అధికారుల చేత మంజూరు చేయించారు. కానీ ఒక్కో పనీ చేయడం అందులో బిల్లులు అయ్యాక మరో పని చేద్దామని కాంట్రాక్టర్లు నిర్ణయించుకోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. కొన్నిచోట్ల నాణ్యతలేని నిర్మాణాలే కనిపిస్తున్నాయి. జిల్లాలోని అన్నిమండలాల అధికారులతో ఇటీవల కలెక్టర్ సమీక్షించారు. అయినా ఇదిగో అదిగో అంటున్నారే తప్ప పనుల్లో పురోగతి కనిపించడం లేదు. పనులపై మరో సారి కలెక్టర్ సమీక్ష నిర్వహించే అవకాశముంది.

మారుస్తారా?

జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి నాటికి చేపట్టాల్సిన పనులను కొంత మంది కాంట్రాక్టర్లు తమ చేతిలోనే ఎక్కువ పనులు అట్టిపెట్టుకోవడంతో పనులు ఆలస్యమవుతున్నాయన్న కారణం తెలుసుకున్న ఇంజనీరింగ్ అధికారులు ఆయా కాంట్రాక్టర్లను మార్చేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. అయితే అధికారులు మరో మారు సమీక్ష నిర్వహించి వ్యక్తిగత లక్ష్యాలను నిర్దేశించి అప్పుడు మరొకరికి పనులు అప్పగించాలనే నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది. దీనిపై శనివారం ఓ సమీక్ష నిర్వహిస్తారని అధికార వర్గాల సమాచారం.

పనులు జోరందుకుంటాయి

జిల్లాలో పనులన్నీ జోరందుకుంటాయి. దీనికోసం అవసరమైతే వెండర్లను మార్చుతాం. వారి వద్ద ఉన్న ఎక్కువ పనులను మరొకరికి అప్పగిస్తాం. త్వరలో జరిగే సమీక్షలో కలెక్టర్ నిర్ణయం తీసుకుంటారు.

– మామిడి శ్రీనివాసరావు, ఎస్‌ఈ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, విజయనగరం

నిరుద్యోగులకు ఝలక్..!



- నోటిఫికేషన్ ఇచ్చినా భర్తీ చేయని పోస్టులు
- ఇతర జిల్లాకు చెందిన ఉద్యోగి నియామకం
- దిక్కు తోచని స్థితిలో దరఖాస్తుదారులు



స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యాలయం

విజయనగరం ఫోర్ట్: జాబు రావాలంటే బాబు రావాలి.. జాబు వచ్చేవరకు నిరుద్యోగ భృతిగా నెలకు రూ.3వేలు చెల్లిస్తామంటూ టీడీపీ కూటమి నేతలు ఊదరగొట్టారు. ఎన్నికల సమయంలో ఓట్లు దండుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చాక ఓ వైపు నిరుద్యోగులకు మొండిచేయి చూపగా... మరోవైపు ఇచ్చిన నోటిఫికేషన్ మేరకు పోస్టులు భర్తీ చేయకుండా నిరుద్యోగులను ఉసూరుమనిపిస్తున్నారు. తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియక నిరుద్యోగ అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. కూటమి సర్కారు నిరుద్యోగులకు గట్టి ఝలక్ ఇచ్చిందంటూ గగ్గోలు పెడుతున్నారు.

గత ఏడాది సెప్టెంబర్‌లో డీసీపీఓ పోస్టుకు నోటిఫికేషన్...

గత ఏడాది సెప్టెంబర్ నెలలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ పరిధిలో ఉన్న జిల్లా బాలల సంరక్షణ విభాగం (డీసీపీయూ)లో జిల్లా బాలల సంరక్షణ అధికారి (డీసీపీఓ) పోస్టుతో పాటు శిశుగృహ, చిల్డ్రన్ హోంలలో పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. 23 పోస్టులకు 640 మంది దరఖాస్తు చేసుకున్నారు. తీరా పోస్టులు భర్తీ చేయకుండా జిల్లా బాలల సంరక్షణ అధికారి (డీసీపీఓ)గా విశాఖపట్నం జిల్లాలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని నియమించారు. దీంతో డీసీపీఓ పోస్టుకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. నోటిఫికేషన్ ఇచ్చి పోస్టులు భర్తీ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తతంగమంతా అధికార పార్టీకి చెందిన ఓ నేత నడిపిస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

దరఖాస్తు వివరాలు	
పోస్టు పేరు	దరఖాస్తుల సంఖ్య
డీసీపీఓ	129
డీఈఓ	218
సోషల్ వర్కర్	55
స్టోర్ కీపర్	107
కుక్	36
హౌస్‌కీపర్	12
నైట్‌వాచ్‌మన్	17
ఎడ్యుకేటర్	28
మ్యూజిక్ టీచర్	25
యోగా టీచర్	13


పోస్టులపై స్పష్టత లేదు

డీసీపీయూ, శిశుగృహ, చిల్డ్రన్ హోంలలో పోస్టుల నోటిఫికేషన్‌పై స్పష్టతలేదు. కొద్ది రోజుల కిందటే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. డీసీపీఓగా ఓ మహిళ జాయిన్ అయ్యారు.

– సుధారాణి, ఇన్‌చార్జిపీడీ, ఐసీడీఎస్

పోస్టుల వివరాలు

జిల్లా బాలల సంరక్షణ అధికారి (డీసీపీయూ) పోస్టు-1, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు-1, సోషల్ వర్కర్ పోస్టు-1, స్టోర్ కీపర్ కమ్ అకౌంటెంట్ పోస్టులు-2, కుక్ పోస్టులు 4, హౌస్ కీపర్ పోస్టులు-2, హెల్పర్ కమ్ నైట్ వాచ్‌మన్ పోస్టులు-3, ఎడ్యుకేటర్ పోస్టులు-3, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ పోస్టులు-3, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్ పోస్టులు-3కు నోటిఫికేషన్ ఇచ్చారు.



2024 సెప్టెంబర్ నెలలో డీసీపీఓ పోస్టుకు ఇచ్చిన నోటిఫికేషన్

క్లుప్తంగా

5నుంచి ఎంజేపీ స్కూల్‌లో క్రీడాపోటీలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేబీబీ రావు

నెల్లిమర్ల: ఈనెల 5వతే దీనుంచి ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాలలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేబీబీ రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాసంస్థ,(విజయవాడ) ఆధ్వర్యంలో జోన్-1 ఆటలు పోటీలు ఈనెల 5,6తేదీల్లో నెల్లిమర్ల ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అలాగే జోన్-1లో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 14 విద్యాసంస్థలకు చెందిన బాలికలు వాలీబాల్, కబడ్డీ, షటిల్, పరుగుపందెం తదితర విభాగాల్లో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కరాటే పోటీల్లో విజయనగరం క్రీడాకారులకు పతకాలు



కరాటే పోటీల్లో సాధించిన పతకాలతో క్రీడాకారులు

విజయనగరం: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఖరగ్‌పూర్‌లో జరిగిన జపాన్ కెన్యూర్యూ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్-24లో విజయనగరం పట్టణంలోని కొత్త అగ్రహారంలో ఉన్న గురుదత్త పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులకు పతకాలు లభించాయి. ఈ మేరకు కరాటే కోచ్ కె.సంతోష్ కుమార్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో విద్యార్థులు పి.హేమంత్ (రెండు బంగారు), కె.శివగణేష్ (ఒక బంగారు, ఒక కాంస్య పతకం), బి.రేశ్వంత్ (కాంస్య) పతకాలతో విజయ భేరి మోగించినట్లు తెలిపారు. కోచ్ సంతోష్ కుమార్‌తో పాటు విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ పద్మ, శంకరరావు తదితరులు అభినందించారు. మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు.

అమ్మవారి హుండీల ఆదాయం రూ.4,47,668


అమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న అధికారులు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో హుండీల ద్వారా రూ.4,47,668 ఆదాయం లభించినట్లు దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జి.శ్యామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో హుండీల ఆదాయం లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. 2024 సెప్టెంబర్ 9 నుంచి 2025 జనవరి 3 వరకు భక్తులు హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించారు.

125 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

బొబ్బిలి: పట్టణ సమీపంలోని గ్రోత్ సెంటర్ వద్ద 125 మద్యం సీసాలను తరలిస్తున్న గున్నతోట వలసకు చెందిన పప్పల రాధాకృష్ణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు ఏఎస్సై జి.భాస్కర రావు తెలిపారు. పారాది నుంచి గున్నతోట వలస వెళ్తున్న రాధాకృష్ణ వద్ద మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం తరలించామన్నారు.



రాజాం: ఈ ఫొటోలోని మహిళ పేరు సీరాపు గౌరమ్మ. వంగర మండలం పట్టువర్ధనం గ్రామం. ఈమె భర్త సీరాపు సింహాచలం సరిగ్గా పదినెలల క్రితం మృతిచెందాడు. వితంతు పింఛన్ నిమిత్తం ఆమె అప్పట్లో గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఆరునెలలకు ఒక దఫా కొత్త పింఛన్లు, సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపికచేసి, సకాలంలో అందించేది. కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో పాటు గత ఎనిమిదినెలలుగా కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో ఈమెకు పింఛన్ అందలేదు. దీంతో ఆమె కుటుంబాన్ని నెట్టుకొచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతోంది. మగదిక్కులేని ఈ కుటుంబానికి ఆసరా కల్పించాల్సిన పింఛన్ అందకపోవడం శోచనీయంగా మారింది.



ఈ ఫొటోలోని మహిళ పేరు కొర్ను రాజులమ్మ. రాజాం మండలం నందబలగ రామం. ఆమె భర్త కొర్ను లింగమూర్తి మే నెలలో మృతిచెందాడు. రోజువారీ కష్టంతో లింగమూర్తి కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. ఆయన మరణాంతరం కుటుంబం రోడ్డున పడింది. రాజులమ్మ పింఛన్ కోసం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంది. ఇంతవరకూ పింఛన్ మంజూరు కాలేదు. గతంలో ఠంచన్‌గా ప్రతి ఆరునెలలకు కొత్త లబ్ధిదారులను గుర్తించి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పింఛన్ అందించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనుమరుగైంది.

పింఛన్..వంచన..!

- కొత్త పింఛన్ల కోసం లబ్ధిదారుల ఎదురుచూపు
- వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు తప్పని ఇబ్బందులు
- గత ఎనిమిదినెలలుగా పింఛన్ మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- జిల్లా వ్యాప్తంగా 8600కు పైగా దరఖాస్తులు
- ఇటీవల సదరం కేంద్రాల నిలుపుదల
- అడ్రస్‌లేని 50 ఏళ్లకే ఫింఛన్ పథకం
- బిత్తరపోతున్న లబ్ధిదారులు
- స్పౌజ్‌కోటాలో కేవలం 292 పింఛన్లు మాత్రమే మంజూరు

జిల్లా వ్యాప్తంగా 8వేలకు పైగా దరఖాస్తులు

గత తొమ్మిదినెలల నుంచి జిల్లా వ్యాప్తంగా 8వేలకు పైగా కొత్త పింఛన్లకు లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులు గ్రామ సచివాలయాల వద్ద ఎదురుచూస్తున్నాయి. వితంతు పింఛన్లతో పాటు వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్ నిమిత్తం సచివాలయాలకు దరఖాస్తులు ఇవ్వడమే తప్ప కొత్త పింఛన్ల మంజూరు, పరిశీలన వంటి కార్యక్రమాలు ఇంతవరకూ ప్రారంభం కాలేదు. వీటికి తోడు కొత్తగా నమోదైన కిడ్నీ, లివర్, హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్, డయాలసిస్, సికిల్‌సెల్, ఒంటరి మహిళ, లెప్రసీ, కండరాల బలహీనత వ్యాధిగ్రస్తులు పింఛన్ల నిమిత్తం ఎదురుచూస్తున్నారు వీటితో వచ్చే నగదుతో మందులు కొనుగోలుచేసి, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం సామాజిక పింఛన్ల మంజూరుకు ఎటువంటి కనికరం చూపించకపోవడం శోచనీయం



రాజాంలో ఖాళీగా సదరం కేంద్రం

సదరం మూసివేత

గతంలో సదరం సర్టిఫికెట్ల మంజూరు కేంద్రాలు నిరంతరం పనిచేసేవి. ప్రతి మంగళ, శుక్రవారాల్లో పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సదరం తనిఖీలు చేసేవారు. ప్రమాదాలు, పక్షవాతం బారిన పడి అంగవైకల్యంతో ఇబ్బందిపడేవారికి సదరం కేంద్రాల్లో తనిఖీ అనంతరం సర్టిఫికెట్లు మంజూరయ్యేవి. వారికి సామాజిక పింఛన్లు మంజూరుతో పాటు పలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిచేకూరేది. ఇప్పుడు ఆ పరిస్థితి తలకిందులుగా మారింది. కొంతకాలంగా సదరం స్లాట్ బుకింగ్‌లతో పాటు సర్టిఫికెట్ల మంజూరును కూడా కూటమి ప్రభుత్వం నిలుపుదల చేసేసింది.

అటకెక్కిన 50 ఏళ్లకే పింఛన్

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 50 ఏళ్లు నిండిన వారందరికీ సామాజిక పింఛన్లు ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఇంతవరకూ ఆ పథకం అమలుకాలేదు. 50 ఏళ్లుదాటితే పింఛన్ వస్తుందని ఎదురుచూడడంతోపాటు ఏ క్షణాన్నైనా పింఛన్ మంజూరవుతుందనే ఆశతో పలువురు లబ్ధిదారులు ఇప్పటికే గ్రామ సచివాలయాల్లో కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డులతో దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులు కూడా ఆయా గ్రామాల టీడీపీ కార్యకర్తలు కలెక్షన్ చేయగా, ఇంతవరకూ పింఛన్ల మంజూరుకు కనీసం దరఖాస్తులు కూడా తీసుకోకపోవడం కొసమెరుపు.

కేవలం నామినీలకే..

జిల్లాలో 8600 మందికి పైగా కొత్త పింఛన్ దరఖాస్తు దారులు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో కేవలం 292 మందికి మాత్రమే స్పౌజ్(నామినీ) కోటాలో జనవరి నెలలో కొత్త పింఛన్ అందించింది. అవి కూడా జిల్లాలో పలుచోట్ల అర్హులకు అందలేదనే విమర్శలు ఉన్నాయి. కేవలం టీడీపీ అనుకూల వర్గీయులకు మంజూరు కావడం, పలుచోట్ల కొత్తగా పింఛన్ వచ్చినవారిని టీడీపీ కార్యకర్తలు ప్రలోభాలకు గురిచేయడం, ఆయా గ్రామాల్లో గ్రామ సచివాలయ సిబ్బంది ఎటువంటి పదవులు లేని టీడీపీ కార్యకర్తలతో పింఛన్లు పంపిణీచేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయంపై రాజాం ఎంపీడీఓ వి. శ్రీనివాసరావు వద్ద సాక్షి ప్రస్తావించగా కొత్త పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియ ఎక్కడా ప్రారంభంకాలేదన్నారు. కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి విధివిధానాలు కూడా ఖరారుకాలేదని వెల్లడించారు.

అంతా బూటకమే



అబద్ధపు హామీలతో కూటమి ప్రభుత్వం గద్దెనెక్కింది. ప్రధానంగా సూపర్ సిక్స్ పథకాలేవీ అమలు కావడంలేదు. వాటి పరిస్థితి పక్కన పెడితే కనీసం పింఛన్ల మంజూరు విషయంలో కూడా ఈ ప్రభుత్వం చొరవచూపకపోవడం శోచనీయం. జిల్లాలో కుప్పలుతెప్పలుగా కొత్త పింఛన్ల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుని సిద్ధంగా ఉన్నారు. ఇంతవరకూ వారికి పింఛన్లు ఇవ్వకపోగా, గత పాత పింఛన్లను కత్తిరించేందుకు కూటమి ఆలోచన చేస్తోంది.

బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎంపీ, విజయనగరం

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి


మహాసభల కరపత్రాలను విడుదలచేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 6,7,8,9 తేదీలలో శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా జరుగుతున్నాయని, వాటిని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బూర వాసు, కోట అప్పన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక అమర్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం, పాలక పక్షాలు విఫలమయ్యాయని విమర్శించారు. భారతదేశంలో యువకులు పెద్ద ఎత్తున ఉన్నప్పటికీ వారికి కల్పించవలసిన హక్కులను నిర్వీర్యం చేశారని విమర్శించారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగినప్పటికీ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఈ తరుణంలో శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా జరుగుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 22వ మహాసభలలో 6వ తేదీ ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని వారు కోరారు. 7,8 వ తేదీలలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే 1000 మంది ప్రతినిధులతో మూడు రోజులపాటు దేశం, రాష్ట్రంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించుకుని యువతను మమేకం చేసి భవిష్యత్తు ఉద్యమాలకు నాంది పలుకుతామన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఎస్ గౌరీశంకర్, సీహెచ్ వెంకటేష్, ఎం.సుధాకర్, ఎస్.మహేష్ పాల్గొన్నారు.

6 నుంచి మెడికల్ పెన్షన్ల రీ వెరిఫికేషన్

- కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్

విజయనగరం అర్బన్: మెడికల్ పెన్షన్ల రీ-వెరిఫికేషన్ ప్రక్రియను ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ తెలిపారు. ఈ ప్రక్రియపై జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, వైద్యాధికారులతో శుక్రవారం సాయంత్రం కలెక్టర్..తన చాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వైద్య పింఛన్లలో పూర్తిగా మంచానికే పరిమితమై పింఛన్ పొందుతున్న వారు 342 మంది ఉన్నారని తొలి విడతలో వీరి పింఛన్లను రీ వెరిఫికేషన్ చేయనున్నట్లు తెలిపారు. తరువాత దశలో మిగిలిన వైద్య పింఛన్లను పరిశీలిస్తారన్నారు. రీ వెరిఫికేషన్‌కు ఇతర జిల్లాల నుంచి 6 బృందాలు వస్తాయని చెప్పారు. ఒక్కో బృందంలో ఒక అర్థోపెడిక్ డాక్టర్, ఒక జనరల్ మెడిసన్ సర్టిఫికెట్, సదరం, ఆధార్ తదితర ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. వరుసగా మూడు రోజుల పాటు ఈ బృందాలు పర్యటిస్తాయని మూడు రోజుల విరామం తీసుకుంటాయని చెప్పారు. వీరి తనిఖీలకు వీలుగా షెడ్యూల్‌ను రూపొందించాలని ఆదేశించారు. సంక్రాంతి పండగకు ముందే వీలైనంత ఎక్కువమందిని తనికీ చేసేలా చూడాలని సూచించారు. పింఛన్‌దారుల అర్హతలను, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించడానికి మాత్రమే ప్రభుత్వం ఈ ప్రక్రియను చేపడుతోందని అర్హుల పింఛన్లు తొలగించే ఉద్దేశం ఎంతమాత్రం ప్రభుత్వానికి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ్ చక్రవర్తి, జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ, ఈపీఓ టి.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు, డీటీసీ డాక్టర్ కె.రాణి, ఆర్‌బీఎస్‌కే డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్: నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై ఉండే పోలీస్ సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ.మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 'పోలీస్ వెల్ఫేర్ డే' (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ముఖ్య ప్రాధాన్యం ఇస్తూ సిబ్బంది వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన పలు సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ గ్రీవెన్స్‌డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొని వారికి ఉన్న సమస్యలను ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. పోలీస్ సిబ్బంది విన్నవించుకున్న సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని ఎస్పీ భరోసా కల్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో ఎస్పీ మాట్లాడి, పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీసీ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.


పోలీసు సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

కూరగాయల పంటల ధ్వంసం

- ఏనుగులను తిప్పి పంపుతున్న ఒడిశా అధికారులు

భామిని: మండలంలోని వంశధార నదీ తీరంలో ఏనుగుల గుంపు విచ్చల విడిగా పంటలు ధ్వంసం చేస్తుంటే పారెస్టు అధికారులు చోద్యం చూస్తున్నారు. శుక్రవారం మండలంలోని పసుకుడి,భామిని గ్రామాలకు చెందిన కూరగాయల పంటలను నాలుగు ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. వంశధార నదీ తీరంలోని ఒడిశా గ్రామాలకు ఏనుగుల గుంపు వెళ్తున్నప్పటికీ ఒడిశా ఫారెస్టు అధికారులు గ్రామాల్లో విద్యుత్తును నిలిపివేసి ఏనుగుల గుంపును తిరిగి ఆంధ్రా గ్రామాలకు తరలిస్తున్నారు. దీంతో ఒడిశా గ్రామాల్లో ప్రవేశిస్తున్నప్పటికీ ఏనుగులను తిరిగి పంపిస్తున్నారని తీర ప్రాంత గ్రామ రైతులు వాపోతున్నారు.

నీతి అయోగ్ అభివృద్ధి పనులు వేగవంతం


నీతి ఆయోగ్ సంయుక్త కార్యదర్శి రాజీమన్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: నీతి ఆయోగ్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆశాఖ సంయుక్త కార్యదర్శి రాజీమన్‌కు సూచించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయానికి నీతి ఆయోగ్ సంయుక్త కార్యదర్శి కె.ఎస్. రాజీమన్ విచ్చేసి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలవగా కలెక్టర్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ ఆశావహ జిల్లాగా పార్వతీపురం మన్యం జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రణాళికపై వివరంగా సంయుక్త కార్యదర్శితో కలెక్టర్ చర్చించారు. ఆశావహ జిల్లాలో భాగంగా ఏర్పాటు చేయనున్న స్కిల్ హబ్ సెంటర్, గ్రామ విజ్ఞాన కేంద్రాల వివరాలను తెలియజేసి పనులు త్వరితగతిన పూర్తి కావాలని కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹204

పర్యాటకరంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గంట్యాడ: పర్యాటకరంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గంట్యాడ మండలంలోని తాటిపూడిలో ఉన్న గొర్రిపాటి బుచ్చిఅప్పారావు జలాశయం వద్ద వాటర్‌స్పోర్ట్స్ సింపల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేసిన అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోటు షికారు ఉంటే పర్యాటకులు ఎక్కువగా వస్తారన్నారు. కోవిడ్ తర్వాత కుటుంబ సభ్యులతో గడపడానికి ఎక్కువ మందికి ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలసయశస్వి, వాటర్ స్పోర్ట్స్ సీఈఓ పాపారావు, మర్రాపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.


తాటిపూడి రిజర్వాయర్‌లో పర్యాటక అభివృద్ధిలో భాగంగా సాహస జలక్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

పోక్సో కేసులో ముద్దాయికి 25 ఏళ్ల జైలు

- ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని రామభద్రపురం పోలీస్‌స్టేషన్‌లో 2024లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు జన్నివలస పంచాయతీ, నేరెళ్ల వలస గ్రామానికి చెందిన 40 ఏళ్ల బోయిన ఎరుకన్న దొరకు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ వకుల్ జిందల్ ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఎస్పీ వెల్లడించిన కేసు వివరాలిలా ఉన్నాయి. 2024 జూలై 13న వరసకు కుమార్తె అయిన ఫిర్యాది ఇంట్లోకి వెళ్లి ఎరుకన్న దొర ఉయ్యాలలో ఉన్న ఆరు నెలల పసిపాపపై లైంగిక దాడికి పాల్పడినట్లు తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రామభద్రపురం పోలీసులు పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును అప్పటి బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు , రామభద్రపురం ఎస్సై జ్ఞానప్రసాద్ దర్యాప్తు చేసి, నిందితుడ్ని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసులో నిందితుడికి శిక్ష పడే విధంగా దర్యాప్తు చేయడంలోనూ, సాక్షులను ప్రవేశపెట్టడంలోనూ క్రియాశీలకంగా పనిచేసిన బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, అప్పటి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు, ప్రస్తుత బొబ్బిలి సీఐ కె.నారాయణరావు, ఎస్సైలు జ్ఞానప్రసాద్, వి.ప్రసాదరావు, హెచ్‌సీ వీఎల్‌వీ.నారాయణ, పీసీవై. అప్పలనాయుడు, ఏఎస్సై కె.పూడినాయుడు, సీఎంఎస్. హెచ్‌సీ సీహెచ్. రామకృష్ణలను ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

ఆర్టీసీ బస్సు బోల్తా


ప్రమాదంలో బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

మెంటాడ: మండలంలోని గుర్రమ్మవలస-బుచ్చిరాజుపేట గ్రామాల మధ్య అర్టీసీ పల్లె వెలుగు అద్దె బస్సు పొలాల్లో శుక్రవారం బోల్తా పడింది. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి జక్కువ వెళ్తున్న బస్సు ప్రమాదవశాత్తు రెండు గ్రామాల మధ్య బోల్తా పడింది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఆరుగురు ప్రమాణికులు మాత్రమే ఉన్నారు. ప్రయాణికులను సురక్షితంగా స్థానికులు బస్సు అద్దాలు పగులగొట్టి బయటకు తీశారు. ప్రయాణికులు ఆరుగురికి స్వల్ప గాయాలు కావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. గాయపడిన వారిని చల్లపేట పీహెచ్‌సీకి వైద్యం కోసం తరలించారు. ఆంద్ర ఎస్సై కె.సీతారాం సంఘనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.


తాటిపూటి అందాలు అదుర్స్


గంట్యాడ మండలంలోని తాటిపూడి పర్యాటక కేంద్రం ప్రకృతి అందాలతో ఆకట్టుకుంటోంది. రెండు కొండల నడుమ ప్రవహిస్తున్న తాటిపూడి నీరు పర్యాటకులను చూపుమరల్చకుండా చేస్తోంది. తాటిపూడి ప్రకృతి అందాలను వీక్షించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం


రెండు కొండల మధ్య ప్రవహిస్తున్న తాటిపూడి నీరు




తాటిపూడిలో ఏర్పాటు చేసిన బోట్లు


తాటిపూడిలో ఏర్పాటు చేసిన బోట్లు